సాక్షి
పల్నాడు
7
మంగళవారం ı 7 ı మే ı 2024

మాచర్లలో సీఎం వైఎస్ జగన్ రాక కోసం ఎదురుచూస్తున్న జనం





మధ్యాహ్నం 1.00 గంటకు పల్నాడు జిల్లా మాచర్లలో జరిగిన సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ప్రచార సభకు తరలివచ్చిన జనసందోహంలో ఓ భాగం(ఇన్‌సెట్‌లో పార్టీ ఎన్నికల గుర్తు ఫ్యాన్ చూపుతున్న ముఖ్యమంత్రి)

జగన్‌కు నీరాజనం

మాచర్లకు పోటెత్తిన జనం • ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఘనస్వాగతం

- మండుటెండలోనూ తగ్గని అభిమానం
- మేమంతా సిద్ధం అంటూ నినదించిన మాచర్ల ప్రజలు
- చంద్రబాబు మోసాల పాలనను వివరించిన ముఖ్యమంత్రి
- ఐదేళ్ల ప్రజాపాలనలో జరిగిన మేలు గుర్తు చేసిన జగన్
- పీఆర్‌కే, అనిల్‌ను గెలిపించాలని ప్రజలకు పిలుపు

అది మిట్ట మధ్యాహ్నం 1.10 గంటల సమయం. ఓ వైపు భానుడి భగభగలు...మరోవైపు ఉక్కపోత...చెమట ధారలుగా కారుతున్నాయ్.. అప్పుడే పల్నాటి గడ్డపై అడుగిడిన అభిమాన నేత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చూడగానే ఆ బాధనంతా మర్చిపోయారు. కేరింతలు కొట్టారు. వైఎస్ జగన్ ప్రసంగిస్తున్న సమయంలో నినాదాలు, చప్పట్లు, ఈలలతో పట్టణం మారుమోగింది. మాచర్ల నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారితో పట్టణం జనసంద్రంగా మారింది. వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.



సాక్షి, నరసరావుపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన బహిరంగసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. సీఎం బహిరంగసభలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, సీనియర్ నేత కొమ్మారెడ్డి చలమారెడ్డి, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతు నాయక్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, ఎనుమల మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాచర్ల పట్టణానికి మధ్యాహ్నం 1.10 గంటలకు గుంటూరు రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. 1.50 నుంచి 2.20 గంటలకు వరకు ప్రసంగించారు. తరువాత 2.40 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకొని మచిలీపట్నం బయలుదేరారు.

చంద్రబాబు మోసాలను గుర్తుచేసిన సీఎం

ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు కేవలం ఎమ్మెల్యే, ఎంపీలను ఎన్నుకొనేవి కాదని, మీరు వేసే ఓటు మీ భవిష్యత్తును, ఐదేళ్లుగా అందిస్తున్న పథకాల కొనసాగింపును నిర్ణయిస్తుందని సీఎం జగన్ పేర్కొన్నారు. ఈ ఎన్నికలలో జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ కొనసాగింపు, పొరపాటున చంద్రబాబుకు ఓటువేస్తే పథకాలన్నీ రద్దు చేసుకున్నట్టేనన్నారు. దీనికి స్పందనగా ఫ్యాన్ గుర్తుకే మళ్లీ ఓటేస్తామని ప్రజలు స్పందించారు. 59 నెలల పాలనలో లంచాలు, వివక్షలేని పాలన అందించామని సీఎం జగన్ అన్నారు. ఒక్కసారి ఆలోచన చేసి మంచి జరిగితేనే ఓటు వేయాలన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో మోసాల పుట్ట అని సీఎం పేర్కొన్నారు. 2014లో ఏం చెప్పాడు, 2014 నుంచి 2019 మధ్య ఎంతటి మోసపూరితమైన పాలన అందించాడో ఒకసారి గుర్తుచేసుకోవాలన్నారు. 2014 మేనిఫెస్టోను చూపించి అందులో రాసిన హామీలు అమలయ్యాయా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో రైతులను చంద్రబాబు నిండా ముంచితే, రైతుభాంధవ ప్రభుత్వంలో అన్ని విధాలా కర్షకులకు మంచి జరిగిందన్నారు. జగన్ ప్రసంగం సమయంలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రతి మాట శ్రద్ధగా ఆలకించి, ఆయన అడిగిన ప్రశ్నలకు స్పందించారు. ప్రసంగంలో సీఎం సిద్ధమా.. అనే పిలుపుకు సభికులంతా పిడికిలి బిగించి మేమంతా సిద్ధం అంటూ గట్టిగా నినాదాలు చేశారు. చంద్రబాబు మోసాలను ఎండగడుతూ జగన్ ప్రసంగిస్తున్న సమయంలో గొంతు కలిపి బాబుకు వ్యతిరేకంగా నినదించారు.





ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి పీఆర్కేను పరిచయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

రామకృష్ణారెడ్డి, అనిల్‌ను ఆదరించండి...

- పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్న మంచివాడు, నాకు మంచి స్నేహితుడని సీఎం జగన్ పేర్కొన్నారు. 'మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు కోరుతున్నాడు. రామకృష్ణారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించండి, రామకృష్ణారెడ్డిని ఇంకా పై స్థాయికి తీసుకుపోతాను. దానితోపాటు తన చేతే వరికపూడిసెల దగ్గరుండి పూర్తి చేయిస్తానని చెబుతున్నాను' అని జగనన్న చెప్పారు.
- అనిల్ నా తమ్ముడు, యువకుడు, ఉత్సాహవంతుడు మంచి చేయడానికి ముందకు వచ్చాడు. మీ చల్లని దీవెనలు, చల్లని ఆశీస్సులు అనిల్‌పై ఉంచాలని సవినయంగా కోరుతున్నానన్నారు.

జగనన్నకు మీ అందరి చల్లని ఆశీస్సులు ఉండాలి...



దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రతి గడపగడపకు ఆ సంక్షేమ ఫలాలు అందించిన సీఎం జగనన్నకు మీ అందరి చల్లని ఆశీస్సులు దీవెనలు అందించాలి. ఓటమి భయంతో ఏమిచేయాలో తోచక చంద్రబాబు దొంగహామీలను ఇవ్వడం ప్రారంభించాడన్నారు. జగన్ ఒకటి ఇస్తానంటే తాను నాలుగిస్తానని చెబుతున్నాడు. అవసరమైతే కొండమీద కోతిని కూడా ఇస్తానని చెప్పి మళ్లీ మోసం చేయడానికి బాబు మరోసారి వస్తున్నాడు. ఒక ఊరంతా బాగుండాలంటే జగనన్న రావాలి. ఊరిలో కేవలం ఇద్దరే బాగుండాలంటే బాబు రావాలని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని మనసాక్షి ప్రకారం ఓటు వేయాలి. వరికపూడిసెల ప్రాజెక్టుకు సంబంధించి మెయిన్‌ట్యాంక్, పంపు స్టోరేజ్ నిర్మాణం చేపట్టాల్సిన ప్రాంతం టైగర్ ఫారెస్ట్ రిజర్వర్‌లో ఉంది, దీనికి అనుమతుల కోసం సీఎం జగన్ పట్టుపట్టి 2023 నవంబర్ కల్లా అన్ని అనుమతులు వచ్చేలా చూశారు. రానున్న 8 నెలల కాలంలో 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నాం. జగనన్న ఆశీస్సులతో మొట్టమొదటిసారిగా నరసరావుపేట పార్లమెంట్‌కి ఒక బీసీ అభ్యర్థిగా నాకు అవకాశం ఇచ్చారు, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇప్పటివరకు ఎవరూ ఈ అవకాశం ఇవ్వలేదు. ఈ రాష్ట్రంలో జగనన్న బీసీలకు పెద్ద పీట వేస్తూ 11 ఎంపీ స్థానాలు ఇవ్వడమే కాకుండా 48 అసెంబ్లీస్థానాలను కేటాయించి తన పెద్ద మనస్సును చాటుకున్నారు.

- అనిల్‌కుమార్ యాదవ్, ఎంపీ అభ్యర్థి

బ్రహ్మనందరెడ్డి రక్షకుడా... భక్షకుడా మీరే నిర్ణయించండి



పార్టీలు, కులాలకతీతంగా మాచర్ల నియోజకవర్గ ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.1,700 కోట్లు సహాయం చేశామనే దమ్ము, ధైర్యం మనకుంది. కుట్రలు, కుతంత్రాలు, మోసాలు, వెన్నుపోటు రాజకీయాలు చేస్తూ ఈరోజు బ్రహ్మనందరెడ్డిని ఇక్కడికి ఇన్‌చార్జిగా పంపించి అనేక రకాల ఫ్యాక్షన్ గొడవలను చంద్రబాబు ప్రోత్సహిస్తున్నాడు. 2009–2021 డిసెంబర్ వరకు ఇక్కడ ఏ చిన్న గొడవ కాని, ఫ్యాక్షన్ హత్య జరగలేదు. బ్రహ్మనందరెడ్డి వచ్చిన తరువాత పాత గాయాలను రేపుతూ ఒక వర్గం నా వెనుక ఉంటుందనే దురుద్దేశంతో ఫ్యాక్షన్ ను ప్రోత్సహిస్తున్నాడు. బాబు తన పాలనలో దోచిన, దాచిన డబ్బును ఇక్కడ బ్రహ్మనందరెడ్డికి పంపిస్తున్నారు. ఇదే బ్రహ్మనందరెడ్డి తల్లి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 1999–2000 కాలంలో ఏడుగురిని కిరాయి మనుషులచే హత్యచేసిన కేసులో ఏ–1గా ఉన్న సంగతి ఈ ప్రాంత ప్రజలు ఇంకా మరువలేదు. ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించే నీచమైన చరిత్ర కలిగిన బ్రహ్మనందరెడ్డి ఇప్పుడు కల్లిబొల్లి కబుర్లు చెబుతూ ఈ నియోజకవర్గానికి ఒక రక్షకుడిని అంటూ చెప్పుకుంటున్నాడు. ఇలాంటి కిరాయి హత్యలు చేయించే బ్రహ్మనందరెడ్డి రక్షకుడా...భక్షకుడా అని మీరే నిర్ణయించాలన్నారు. 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే వరికపూడిసెల ప్రాజెక్టును 8 నెలల కాలంలో పూర్తి చేయడానికి సీఎం జగన్ సిద్ధంగా ఉన్నారు. మాచర్లలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం, మాచర్ల పట్టణంలోని ప్రతి ఇంటికి మంచినీటి సరఫరా ప్రాజెక్టుకు రూ.70కోట్లతో పనులు పూర్తి చేస్తాం. ఇన్ని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన సీఎం జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు, మాచర్ల నుంచి నన్ను, బీసీ వర్గానికి చెందిన అనిల్‌కుమార్ యాదవ్‌ను ఎంపీగా గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుపై రెండుసార్లు ఓటు వేయాలని కోరుతున్నాను.

- పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి



జననేతకు అభివాదం చేస్తున్న అభిమానులు



బస్సు నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్



సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు పరుగులు పెడుతున్న జనం



సీఎం వైఎస్ జగన్‌కు దిష్టి తీస్తున్న మహిళలు

ఓపీవోలకు నియామక ఉత్తర్వులు ఇవ్వండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓపీవోలుగా నియమితులైన సిబ్బందికి నియామక ఉత్తర్వులు త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో విద్యాశాఖ, జిల్లా పంచాయతీ శాఖ, ఐసీడీఎస్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు కేటాయించిన సిబ్బంది ఫాం-12 దాఖలు చేసిన వారు ఆయా నియోజకవర్గంలోని ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ వసతిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫాం-12 దాఖలు చేయని వారు 7,8 తేదీలలో నేరుగా ఆయా నియోజకవర్గంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఫాం-12 అందించి నేరుగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కేఆర్.కల్పశ్రీ, డీపీవో కేవీ. భాస్కర్ రెడ్డి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

మేలు చేసిన వారికే మళ్లీ పట్టం కట్టండి

- జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు
- గోళ్లపాడులో ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో మంత్రి అంబటి రాంబాబు

గోళ్ళపాడు (ముప్పాళ్ళ): ప్రతి ఇంటికీ మేలు చేసి, ఇచ్చిన హామీలను అమలు చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డికే మళ్లీ పట్టం కట్టాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రజలకు పిలుపునిచ్చారు మండలంలోని గోళ్ళపాడు, కుందురువారిపాలెం, లంకెలకూరపాడు, పలుదేవర్లపాడు, నార్నెపాడు గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. సంక్షేమ పథకాలను రాజకీయ ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేయడం ద్వారా రాష్ట్రంలో సరికొత్త విప్లవానికి శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. సంక్షేమాభివృద్ధి కొనసాగాలంటే ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. రెండు గ్రామాల్లో జరిగిన ప్రచారం నరసరావుపేట పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయ ల రాజా నారాయణ, సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, పార్టీ కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, సర్పంచ్‌లు గోపు అప్పమ్మ, చయికం వెంకటప్పారెడ్డి, మోర్తాల వెంకట రమణారెడ్డి, కంభంపాటి కెజియమ్మ, ఎంపీటీసీలు మేడా వెంకట రమణ, మనికె ఏసమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి, ముప్పాళ్ళ సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి సాయిరెడ్డి, ఇందూరి నరసింహా రెడ్డి, యనమాల సింగయ్య, బ్రహ్మారెడ్డి, గోపు యలమందయ్య, కుందురు శ్రీనివాసరెడ్డి, బాలకోటి, షేక్ సుల్తాన్, రామిరెడ్డి, ప్రభాకరరెడ్డి, జక్కిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అందరినీ మోసం చేసిన చరిత్ర చంద్రబాబుది

- ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి
- రజకులతో ఆత్మీయ సమావేశం



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి మద్దతు తెలియచేస్తున్న నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో రజకులతో పాటు ప్రతి ఒక్కరినీ మోసం చేసిన చరిత్ర చంద్రబాబునాయుడిదని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కాసు కన్వెన్షన్ సెంటర్‌లో రజక నాయకులు మర్రిపూడి రాంబాబు, కుంకలగుంట శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ రజకుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రజకుల వీర నారామణి చిట్యాల ఐలమ్మ, వీరుడు మసిపూడి మల్లయ్య చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో రజకులు కష్టజీవులు అన్నారు. వారి చేయి చల్లగా ఉంటుందనేది పెద్దలు చెబుతుంటారన్నారు. ఆ చేతి దీవెనలు తమకు కావాలన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఇస్త్రీ బండి నిర్వాహకులకు ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఐదేళ్లపాటు ఇచ్చారన్నారు. బీసీలంటే సీఎం జగన్‌కు చాలా ఇష్టమని, వైఎస్సార్‌సీపీ బీసీల పార్టీనని పేర్కొన్నారు. తన మంత్రివర్గంలో అత్యధికులు బీసీలకే ఇచ్చారన్నారు. తమ పార్టీ బీసీ వర్గాలకు గౌరవం ఇస్తుందన్నారు. నరసరావుపేట పార్లమెంటు స్థానం తొలిసారిగా బీసీ అభ్యర్థి డాక్టర్ పి.అనీల్ కుమార్ యాదవ్‌కు ఇచ్చిన చరిత్ర తమ పార్టీదన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు, గుంటూరు ఏపీపీ పోకల వెంకటేశ్వర్లు, కొమ్మసాని కమలాకరరెడ్డి, స్థానిక రజక నాయకులు బండి సుబ్బారావు, మోటుపల్లి అంజి, విట్నాల అశోక్, దావులూరి శ్రీనివాసరావు, బాదుగున్నల శ్రీనివాసరావు(డీలర్), పాతపాటి శ్రీనివాసులు, నీలం రత్తయ్య, చెరుకూరి రాంబాబు, నూతనలపాటి శివలీల, దుర్గా పార్వతీ, రజకులు పాల్గొన్నారు.

ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకే టీడీపీ పన్నాగం

డాక్టర్ అనిల్, డాక్టర్ గోపిరెడ్డి



పోస్టల్ పోలింగ్ సెంటర్‌కు దూరంగా పల్నాడురోడ్డుపై మీడియాతో మాట్లాడుతున్న పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ పి.అనీల్, డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ జరుగుతున్న ఫెసిలిటేట్ సెంటర్ వద్ద పసుపు కండువాలు వేసుకొని 200 మంది జెండాలతో రావటం ఎంతవరకు సబబని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు వారు అక్కడకు కావాలని వచ్చారని వైఎస్సార్ సీపీ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి పోలింగ్ జరుగుతున్న ఫెసిలిటేట్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం సెంటర్‌కు దూరంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఇద్దరూ మాట్లాడారు. డాక్టర్ అనిల్ మాట్లాడుతూ ఆరేడు వాహనాలతో కలిసి సుమారు 200 మంది వరకు పోలింగ్ సెంటర్‌కు ఎందుకు వచ్చారని ప్రశ్నించిన మాజీ మిలటరీ ఉద్యోగి మధిర సత్యనారాయణ రెడ్డిని వీడు వైఎస్సార్‌సీపీ వాడు అంటూ మమ్మల్నే ప్రశ్నిస్తావా అంటూ కారులోకి బలవంతంగా లాగి కొట్టి కొద్దిదూరం తీసుకెళ్లి అపహరించే ప్రయత్నం చేసి మళ్లీ వదిలేశారన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి వెంటనే స్పందించి కార్యకర్తలను కాపాడుకునేందుకు పోలింగ్ సెంటర్‌కు వచ్చారన్నారు.

డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ తప్పు చేసిన వారే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. నిష్పక్షపాతంగా పోలింగ్ నిర్వహించాలని అధికారులను కోరామన్నారు. మేకల రాజకుమార్ అనే యువకుడు లోపల డబ్బులు పంపిణీ చేస్తున్నాడన్నారు. ఓటు వేసేందుకు వచ్చేవారిని భయభ్రాంతులకు గురిచేసేందుకు టీడీపీ నాయకులు కుట్రకు తెరతీశారన్నారు. మిలటరీ వ్యక్తిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు.

వైఎస్సార్ సీపీలోకి పలువురు చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో 13వ వార్డుకు చెందిన కరిముల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు కొఠారు నరసింహారావు ఆధ్వర్యంలో 15 కుటుంబాలు గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగు దేశం పార్టీపై విసుగు చెందిన, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ ఫలాలు, గురజాల నియోజకవర్గంలో కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు.

జగనన్న సారథ్యంలోనే రాష్ట్రం సుభిక్షం

- పట్టం కట్టాల్సిన బాధ్యత మనందరిదే
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ఈపూరు మండలంలో ఎన్నికల ప్రచారం



కొండ్రముట్ల ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా

ఈపూరు: రాష్ట్రంలో ప్రజలందరూ సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలంటే మరోసారి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని బోడెపూడివారిపాలెం, దూష్మాన్‌పేట, కొండ్రముట్ల తదితర గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను తూ.చ. తప్పకుండా పాటించి అమలు చేశారని, అలాగే ఇప్పుడు ప్రకటించిన మేనిఫెస్టో కూడా మళ్లీ అధికారంలోకి వస్తే తప్పకుండా నెరవేరుస్తారన్నారు.

కనుక వినుకొండలో బొల్లా బ్రహ్మనాయుడును, నరసరావుపేట ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని, మీ అందరి ఆశీర్వాదంతో జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ఎమ్మెల్యే బొల్లా అన్నారు. చంద్రబాబు చెప్పేవి బూటకపు మాటలని, ఏ ఒక్క హామీ నెరవేర్చడని, అది అందరికీ తెలిసిన విషయమే అన్నారు. గతంలో చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రి గా చేసి ఈ రాష్ట్రానికి, ప్రజలు ఏం వెలగబెట్టారో చెప్పాలని, ఇక వినుకొండలో బురిడీబాబా ఆంజనేయులు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలందరికీ తెలుసన్నారు. ఆయన వేసిన శిలాఫలకాలు శిథిలమయ్యాయి

వైఎస్సార్ సీపీలోకి 20 కుటుంబాలు చేరిక



ఎమ్మెల్యే శంకరరావు సమక్షంలో చేరిన ఆవులవారిపాలెం టీడీపీ కార్యకర్తలు

బయ్యవరం(క్రోసూరు): బయ్యవరం గ్రామానికి చెందిన 20 కుటుంబాల టీడీపీ కార్యకర్తలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు నంబూరు శంకరరావు సమక్షంలో పార్టీ బాట పట్టారు. అలాగే ఆవులవారి పాలెం గ్రామానికి 20 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే బూరు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

హజ్ యాత్రికులకు నేటి నుంచి వైద్య పరీక్షలు

జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి

నరసరావుపేట: పల్నాడు జిల్లా నుంచి హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులకు ప్రత్యేక వైద్యపరీక్షలు, వ్యాక్సినేషన్ శిబిరాన్ని స్థానిక లింగుంట్లలోని ఏరియా ఆసుపత్రిలో ఈనెల 7వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తున్నట్టు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి సోమవారం తెలిపారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో మొత్తం హజ్ యాత్రకు వెళ్లే 78 మందికి పరీక్షలు చేయటం జరుగుతుందన్నారు. కాగా, హజ్‌యాత్రకు వెళ్లే ప్రయాణికులకు అందరూ పోలియో, మెదడువాపు, ఇంఫ్లూయంజా నివారణకు వ్యాక్సినేషన్, ప్రత్యేక వైద్యపరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి పేర్కొన్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

మాచవరం: వడదెబ్బతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని గాంధీనగరం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యామినేని జానమ్మ (81) సోమవారం మధ్యాహ్న సమయంలో తీవ్రమైన వడగాలకు తట్టుకోలేక సొమ్మసిల్లి పోయింది. స్థానిక వైద్యులచే చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. విసయాన్ని అధికారులకు తెలియజేసినట్లు తెలిపారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది

- గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- చిలకలూరిపేటలో ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం
- హాజరైన ఎమ్మెల్యే అభ్యర్థి కావటి



మాట్లాడుతున్న గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

చిలకలూరిపేట: ఆర్యవైశ్యులకు ఎప్పుడూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నియోజకవర్గంలోని పట్టణం, నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట మండలాలకు చెందిన ఆర్యవైశ్యులు కుటుంబ సమేతంగా హాజరై తామంతా వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్నామని ప్రకటించారు. ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివ నాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ ఆర్యవైశ్యులతో తమ కుటుంబానికి ఆత్మీయ బంధం ఉందన్నారు. గత టీడీపీ హయాంలో ఆర్యవైశ్యులకు అప్పటి మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి అయిన వెంకాయమ్మ వి-ట్యాక్స్ విధించి వేధించిన విషయం తనకే కాదు నియోజకవర్గం అందరికీ తెలిసిందేనన్నారు. పల్నాడు జిల్లా అభివృద్ధి కమిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా ఆర్యవైశ్యుల సేవాభావాన్ని, ఐక్యతను, వారి సాధకబాధల గురించి ప్రసంగించారు.

రెండోరోజు పోస్టల్ ఓటింగ్

- మూడు నుంచి ఏడుకు పెంచిన పోలింగ్ కేంద్రాలు
- సులభంగా ఓటుహక్కు వినియోగించుకున్న ఉద్యోగులు
- టీడీపీ దౌర్జన్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి



ఎస్ఎస్ఎన్ కళాశాల ఫెసిలిటేట్ సెంటర్‌లో పోస్టల్ ఓటు వేసేందుకు బారులు తీరిన ఉద్యోగులు

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగులు అందరికీ ఓటుహక్కు కల్పించేందుకు మూడురోజుల పాటు ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో జిల్లా వ్యాప్తంగా రెండురోజుల వ్యవధిలో 83.34 శాతం జరిగింది. జిల్లాలోని ఏడు ఫెసిలిటేటర్ల సెంటర్లలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల కోసం ఎస్ఎస్ఎన్ కళాశాల ఫెసిలిటేట్ సెంటర్‌లో రెండోరోజు సోమవారం ఏర్పాటు చేసిన పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఓట్లు వేసేందుకు ఉదయం నుంచే ఉద్యోగులు బారులు తీరారు. మొత్తం జిల్లాలో 16,282 మంది ఉద్యోగులు, ఇతరులు పోస్టల్ ఓటును ఏడు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఏడు ఫెసిలిటేట్ సెంటర్లలో మూడు రోజుల్లో వినియోగించుకోవాల్సి ఉంది. నరసరావుపేట నియోజకవర్గంలో మొత్తం 2859 మంది ఉద్యోగుల్లో మొదటిరోజు 1340 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోగా, రెండోరోజు సోమవారం మిగతా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఫెసిలిటేట్ సెంటర్‌కు తరలి వచ్చారు. మొదటి రోజు కేవలం మూడు బూత్‌లను ఏర్పాటు చేయటంపై వచ్చిన అభ్యంతరాల మేరకు ఈరోజు సోమవారం అధికారులు ఏడు బూత్‌లను ఓటు వేసేందుకు ఏర్పాటు చేశారు. దీంతో ఓటర్లు సులభంగా గంటల వ్యవధిలోనే తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 12.15కు మొత్తం ఏడింటిలో నాలుగు బూత్‌లలో ఓట్లు వేసేవారు లేకపోవటంతో క్యూలైన్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఒకవైపు ఎండవేడిమి, మరోవైపు ఉక్కపోత మధ్య ఓటుహక్కును సాయంత్రం సమయంలో వినియోగించుకుందామనుకొని ఓటర్లు మధ్యాహ్నం సమయంలో పోలింగ్ సెంటర్‌కు పలుచగా హాజరయ్యారు. మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి ఒకరొకరుగా ఓటర్లు రావటం కన్పించింది. సాయంత్రం ఆరుగంటలకల్లా అధికారులు గేట్లు మూసేసి లోపల ఉన్నవారికి మాత్రమే ఓటు వేసే అవకాశం కల్పించారు.

83.34 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	6వ తేదీన పోలైన ఓట్లు	రెండురోజుల వ్యవధిలో పోలైన ఓట్లు	మొత్తం శాతం
పెదకూరపాడు	1929	718	1682	87.26
చిలకలూరిపేట	2207	688	1907	86.41
నరసరావుపేట	2859	1086	2424	84.78
సత్తెనపల్లి	2303	605	1843	80.03
వినుకొండ	2373	695	2050	86.39
గురజాల	2338	894	1804	77.16
మాచర్ల	2273	791	1811	79.67
మొత్తం	16,286	5477	13521	83.34

డాక్టర్ గోపిరెడ్డి ఆగ్రహం

ఉదయమే రిటైర్డు ఆర్మీ ఉద్యోగి మధిర సత్యనారాయణ రెడ్డిపై టీడీపీ అభ్యర్థి కుమారుడు చదలవాడ ఆదిత్య చేసిన దౌర్జన్యాన్ని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గేటు బయట సత్యనారాయణ ఉండగా అదే సమయంలో ఆదిత్య కార్ల కాన్వాయితో ప్రవేశ ద్వారం వరకు వచ్చాడు. దీనిపై సత్యనారాయణరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయటంతో ఆగ్రహం వ్యక్తం చేసిన వారు అతడిపై చేయి చేసుకొని బలవంతంగా తమ కార్లలో ఎక్కించుకొని అపహరించే ప్రయత్నం చేశారు. తాను రిటైర్డు మిలిటరీ వ్యక్తినని చెప్పటంతో వదిలిపెట్టారు. తనపై చేసిన దౌర్జన్యాన్ని వైఎస్సార్ సీపీ నాయకులకు తెలియచేయటంతో వారు రొంపిచర్ల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి సమాచారం అందించారు. ఆయన వెంటనే స్పందించి ఫెసిలిటేషన్ సెంటర్‌కు చేరుకున్నారు. ఈలోగా పోలింగ్ సెంటర్ లోపలికి వెళ్లిన ఆదిత్య ఎమ్మెల్యే రాకను గమనించి రెండో గేటు నుంచి తన అనుమాయులతో పరారయ్యారు. పోలీసులు సెంటర్‌కు వందమీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు.